# దోబూచి

## ( నాటిక )

రచన : శంకర మంచి పార్థసారథి

పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1. | భాను మూర్తి | - | 70 సం॥ |
| 2. | కృష్ణమూర్తి | - | 40 సం॥ |
| 3. | సత్యమూర్తి | - | 35 సం॥ |
| 4. | ప్రసాదరావు | - | 50 సం॥ |
| 5. | సుబ్బలక్ష్మి | - | 25 సం॥ |
| 6. | కామాక్షి | - | 35 సం॥ |

# దోబూచి

## ( నాటిక )

రచన : శంకర మంచి పార్థసారథి

**తెర తీసేసరికి.....**

అదొక మధ్య తరగతి ఇంట్లో డ్రాయింగ్ రూం. ఎడం వైపున వంటగదికి, పడక గదికి రెండు ద్వారాలు, కుడివైపున వీధిధ్వారం కనిపిస్తున్నాయి. గది మధ్యలో టీపాయి, రెండు కుర్చీలు, గోడలకి క్యాలండర్లు వగైరా అలంకరణ కనిపిస్తోంది. హీరో కృష్ణమూర్తి మొబైల్ ఫోనులో మాట్లాడుతూ బయటనుంచి వచ్చాడు.

కృష్ణ : హలో.....భానుమూర్తిగారా.... మా మావగారే లెండి మీరెవరు ..... అపోలో హాస్పిటల్ నుంచా .... ఏంటీ బిల్లు పెండింగుందా...త్వరగా పంపించాలి ....( ఫోన్ కట్ చేసాడు మొహం కోపంతో ఎర్రబడింది. ఎం చెయ్యాలో తెలియని వాడిలా కసి కోపం కొద్ది ఎదురుగా కనిపిస్తున్న కుర్చీలని ఆవేశంగా తన్ని పారేస్తూ )

కృష్ణ : ఛీ ఛీ వయసు రాగానే సరా బుద్ది, జ్ఞానం ఉండాలి, నా ఖర్మ కొద్దీ దొరికాడు. కడుపుకు అన్నం తినే వాడెవడూ ఇన్ని సార్లు చెప్పించుకోడు. అంత వయసొచ్చినా ఏం లాభం వరస్టు ఫెలో .....( పక్కింటి ప్రసాదరావు పడగ్గదిలోంచి అక్కడికి వస్తూ )

ప్రసా : కష్ణమూర్తి గారూ, గుడ్ మార్నింగ్, ఏమిటీ ఆవేశం ఏమైంది....ఎవరినో వరస్టు ఫెలో అంటున్నారు, కొంపదీసి నన్ను కాదు కదా....

( కృష్ణ మూర్తిలో ఆవేశం జారిపోగా, కంగారుగా కుర్చీలని సర్ధుతూ )

కృష్ణ : అయామ్ సారీ, రండి..... వెరివెరి సారి పొరపాటున మా ఇల్లునుకుని కుర్చీలు తన్నేసా....అయినా మీ ఇంటికొచ్చి మా ఇల్లని ఎలా అనుకున్నానబ్బా

( అంతలో భానుమూర్తి గూడా లోపలినించి అక్కడికి వచ్చాడు )

ప్రసా : భలే వారే  ఇది మీ ఇల్లే. అవి కుర్చీలే, మీ మావగారిని కలిసి గుర్తు చేసి పోదామని ఇలా వచ్చా.

భాను : ఎవరా వచ్చింది....కృష్ణమూర్తా....ఎవరి మీదనయ్యా  అరుస్తున్నావ్ ఏవైంది.

కృష్ణ :  ఏవైందా....జీవితం  మీద విరక్తి పుట్టింది.  ఈ శుభవార్త ప్రపంచానికి ఎలుగెత్తి చెప్పాలని అరిచి చచ్చా.

ప్రసా : మూర్తిగారు బాగా అప్సెట్టయి, బ్యాడ్ మూడ్లో వున్నారు. నేవస్తా ( భానుమూర్తితో ) మీరిద్దరూ సంప్రదించుకుని ఇవాళగాని, రేపు మార్నింగ్ కయినా అరేంజ్ చేస్తే చాలు.

కృష్ణ : ఆగండి ఏమిటి అరేంజ్ చేసేది, అంటే ఆయన మీకు అప్పున్నాడా ?

భాను : ఏంలేదయ్యా వడ్లగింజలో బియ్యపు గింజ మొన్న మెట్లు దిగుతూ కాలు మెలికపడి పడ్డా కదా. ఎందుకైనా మంచిదని ఆస్పత్రికి వెళ్ళి ఎక్స్‌రే తీయించి, టెస్టులన్నీ చేయించా, పదివేలయింది అంతే.

కృష్ణ : అంతేనా....

భాను : అంతే

కృష్ణ : ( వ్యంగ్యంగా ) వడ్ల గింజలో బియ్యపు గింజ.

భాను : అంతే కదా. వడ్లగింజలో బియ్యపు గింజ కాక బాదంపప్పు వుంటుందా, చెప్పవయ్యా

ప్రసా: ఆరోజు మా కొలిగ్‌ని పరామర్శించటానికి ఆసుపత్రికో పోతే, ఇదిగో ఆయనగారు కనిపించి ఏదో కాగితం చేతికిచ్చి చాక్కపోయాడు. తీరా చూద్దును కదా, ఆసుపత్రి వాళ్ళిచ్చిన బిల్లు, వాళ్ళేమో నన్ను నిలేసారు, బయిటకొచ్చి చూస్తే ఈయన జంప్. పేమెంట్ చేయకుండా వెళ్ళటానికి వీల్లేదన్నారు. పక్కన ఏటీయమ్ లో డ్రాచేసి బయిటపడ్డా....

కృష్ణ : ఛీ ఛీ – ఏం అనాలో ఏ పదం వాడాలో గూడా అర్థంకావటంలా, అయినా మీరు ఉత్త అమాయకులండి. మీరెందుకు పే చేయటం.

ప్రసా : అక్కడి సిట్యుయేషన్ నీకు తెలీదు. వాళ్ళతో గొడవపడ్డారనుకో ఏ మత్తు మందో పెట్టి లివరో కిడ్నీలో లాక్కున్నారనుకో....

కృష్ణ : నేనైతే పారిపోయే వచ్చుండేవాడిని.

ప్రసా : అనుకున్నా కానీ కీళ్ళ నొప్పులుగదా పరిగెత్తి చావలేను.

భాను : దగ్గరుండి టెస్టులన్నీ చేయిస్తానంటే వచ్చావా, తర్వాత చూద్దాం అంటూ వాయిదాలు వేసావ్....నన్ను చూడు, హెల్తుపట్ల ఎంత అలర్టుగా వుంటానో, ఇందతా నాకోసమా, కాదు పిల్లలగురించి,

కృష్ణ : ఏమిటి చీటికి మాటికి ఆస్పత్రులకి పరిగెత్తి వేలకి వేలు ఖర్చు చేయిస్తున్నది మాగురించా, ఈ మధ్యన మీరు అపోలో ఆసుపత్రిని గారి దర్శించారా.

భాను : అపోలో అంటే కొండల మధ్యన వుంటుంది స్టార్ హొటల్లా లంకంత ఆసుపత్రి

ప్రసా : ఆ అదే అదే వెళ్ళారా....

భాను : ఆ గుర్తొచ్చింది వెళ్ళానయ్యా....వెళ్ళా....ఒకరోజు వున్నట్టుండి కడుపులో పోటు

మొదలయితే కొంప మునిగిందిరా భగవంతుడా అన్చెప్పి 108కి ఫోన్ చేసా, అయిదు నిమిషాల్లోకుయ్ కుయ్ అంటూ అంబులెన్స్ వచ్చింది. ఎక్కి పడుకున్నా ఎక్కడికి సార్ అన్నాడు.... నీ ఇష్టం అన్నా అంతే అయిదు నిమిషాల్లో అపోలో ముందు దింపాడు.

ప్రసా : ఇంతకీ ఏంటి ప్రాబ్లమ్.

భాను : గ్యాస్ ట్రబులని చెప్పి మాత్రల్చిచ్చి పంపించారు.... పాపం ఓపిగ్గా టెస్టులన్నీ చేసారు.

కృష్ణ : చేస్తారు....ఎందుకు చెయ్యరూ, బిల్లు తడిసి మోపెడయింది, ఫోన్ మీద ఫోన్.

భాను : పేషెంటు ఎలా వున్నాడని అడగటానికి అయ్యుంటుంది. అపోలో వాళ్ళకి ఇంత ఆప్యాయత ఏమిటయ్యా.

కృష్ణ : ఆప్యాయతా నా మోహమా..... బిల్లు కట్టమని ఫోన్.

ప్రసా : సాధారణంగా బిల్లు పే చేయకుండా వదిలి పెట్టరే ఏలా మేనేజ్ చేసారు.

కృష్ణ : ఏముంది.... జంప్ జిలాని, పారిపోయి వచ్చుంటారు.

భాను : జమాజెట్టీలాంటి ఇద్దరు అల్లుళ్ళుండగా పారిపోయి రావడానికి నాకేం ఖర్మయ్యా దర్జాగా నడుచుకుంటూ బయిటికి వస్తుంటే డాక్టరు గారు ఎదురయి గోయింగ్ ఫర్ వాక్కా అన్నారు. కాదంటే బాధ పడతాడేమో అని బయిటికి వచ్చి ఆటో ఎక్కా, అన్నట్టు ఆటో వాడికి మూడొందలు ఇవ్వాలయ్యా మర్చిపోయా.

( అంతలో సుబ్బలక్ష్మి బయట నించి అక్కడికి వచ్చింది. కృష్ణమూర్తి కోపంగా )

కృష్ణ : ఎక్కడికి వెళ్ళావ్ ఈ మధ్య నీకు పెత్తనాలు ఎక్కువైనాయి.

సుబ్బు : పెత్తనాలా నాబొందా కామాక్షి గారు పిలుస్తేను.

ప్రసా: మా కామాక్షి పిలిచిందా. అది నా గురించి వున్నవి లేనివి చెపుతుంది, నమ్మకండి, నేను అనుమానం మనిషినని, దాన్ని బాగా కష్టపెడుతున్నానని చెపుతుంది. ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయాలి, అంతే, సర్లే నే వస్తానండి, ఆ ఎమౌంటు కాస్త త్వరగా సెటిల్ చేయండి ( ప్రసాద రావు ఎగ్జిట్ )

సుబ్బు : నాన్నా ఆ కామాక్షి ఒకటే గోల ఈ వెధవకి భార్యపైన అంత అనుమానం ఏమిటో, రాత్రి ఇద్దరికి పెద్దగా గొడవైందట. చెప్పుకుని ఒకటే ఏడుపు.

కృష్ణ : మన ఏడుపు మనకు చాలు పక్క వాళ్ళ ఏడుపులు కూడా దేనికి చూడండి ఇకనుంచి నాకు తెలీకుండా, నా పర్మిషన్ తీసుకోకుండా అపోలోకి, కామినేనికి పరిగెత్తారో నే ఆత్మహత్య చేసకుంటానంతే

( ఆవేశంగా లోనికి వెళ్ళిపోయాడు )

సుబ్బు : ఛీ ఛీ అవేం మాటలండీ ఛండాలంగా

భాను : నాకూ ఒక మగ పిల్లాడుంటే ఏ సమస్యా వుండేది కాదు, ఇద్దరూ ఆడపిల్లలయిపోయారు. నేనిక్కడ, మీ అమ్మ నీ చెల్లెలి దగ్గిర. ఇదే మన్నా మాకు ఆనందమా.

సుబ్బే : ఛ భాధ పడకు నాన్నా ఆయనేదో  కోపంలో అన్నారు గానీ, నువ్వంటే ఎంత గౌరవమో నీకు తెలీదు. రేపు  నీ పుట్టిన రోజు వచ్చినప్పుడు అమ్మకి పట్టు చీర కొని పెడదాం అన్నారు.

భాను : అవునేవ్ ఆమాటే మరచిపోయా, నా పుట్టిన రోజు నాడు ప్రతి సంవత్సరం నేను మీ అమ్మ కల్సుకోవాలిగా, ఇవాళ తిధేమిటి.

సుబ్బు : ఎల్లుండే నీ పుట్టిన రోజు

భాను : బాగా గుర్తు చేసావమ్మా అమ్మకి ఫోన్ చెయ్యి, తను వస్తుందా, మనల్ని రమ్మంటుందా కనుక్కో ( సుబ్బలక్ష్మి మొబైల్లో ట్రయ్ చేస్తోంది, కృష్ణమూర్తి మళ్ళీ అక్కడికి వచ్చాడు భాను మూర్తి అనునయంగా )

భాను : అల్లుడూ అత్త మామలంటే నీకెంత అభిమానం ప్రేమ వున్నాయని అనుకోలా, నువ్వు అన్ని దాచుకునే టైపు అప్పుడప్పుడన్నా బయట పెట్టాలయ్యా.

కృష్ణ : ఏమిటి బయట పెట్టేది....

సుబ్బు : నాన్నా అమ్మ  నెంబరు అవుటాఫ్ కవరేజ్ ఏరియా అని వస్తోంది.

భాను : అదేమిటీ మళ్ళీ ట్రయ్ చెయ్.

( ప్రసాదరావు నిశ్శబ్దంగా వచ్చి, కృష్ణమూర్తితో వాళ్ళిద్దర్నీ  లోపలికి పంపమని సౌజ్ఞలు చేస్తున్నాడు. కృష్ణమూర్తికి మొదట అర్ధం కాక, అయోమయంగా )

కృష్ణ : ఏమిటండి నాకు మెదడు మొద్దు పారింది.... మేటరేమిటో చెప్పండి

( కృష్ణమూర్తిని పక్కకి లాక్కొచ్చి రహస్యంగా )

ప్రసా: మనం ముఖ్యమైన సంగతొకటి  డిస్కస్ చేయాలి వాళ్ళని లోపలికి వెళ్ళమను.

కృష్ణ : మీరు లోపలికెళ్ళి ఫోన్లో మాట్లాడుకోండి, సుబ్బలక్ష్మి ఆయన్ని లోపలికి తీసుకెళ్ళు.

సుబ్బు : రా నాన్నా దొడ్లో కెడితే సిగ్నల్సు  వస్తాయేమో

ప్రసా : సిగ్నల్సు  వస్తేనే గదా దొడ్లోకి వెళ్ళేది.

కృష్ణ : అది కాదులెండి. ( భాను మూర్తి సుబ్బలక్ష్మి లోనికి వెళ్ళిపోయారు)

కృష్ణ : ఇప్పుడు చెప్పండి ఇందాకేదో  ఇంపార్టెంటు  విషయం  అన్నారు.

ప్రసా : నా భార్య నీ భార్యతో నా గురించి ఏవన్నా చెప్పినట్టు  నీ భార్య నీకు చెప్పిందా.

కృష్ణ : ఒక్కముక్క అర్థం అయితే చెప్పుచ్చుగొట్టండి.

ప్రసా : అదేమిటయ్యా, మేటరు వెరీ వెరీ ప్లెయిను. జాగ్రత్తగా ఫాలో అవ్వు నా భార్య నీ భార్యతో నా గురించి ఏవన్నా చెప్పినట్టుగా నీ భార్య నీకు చెప్పిందా.

( కృష్ణ మూర్తి వొళ్ళు మండి కసిగా మళ్ళీ కుర్చీ తన్నాడు )

ప్రసా : అదేమిటి

కృష్ణ : ఇది నా ఇల్లు, ఇది నాకుర్చీనీ నాకు తెల్సు ... నా పొజిషన్ అలా వుంది.

( అంతలో భాను మూర్తి, సుబ్బలక్ష్మి అక్కడికి వచ్చారు )

భాను : నాకు కంగారుగా ఉందమ్మా. అమ్మ నెంబరు కనెక్టు కాకపోవడం ఏమిటి

సుబ్బు : ఏవండి మీ మొబైల్లోంచి అమ్మ నెంబరుకు ట్రయ్ చేయండి.

కృష్ణ : నాకూ నా మొబైల్‌కి చార్జింగ్ అయిపోయింది. సుబ్బలక్ష్మి గారూ.

ప్రసా : పెళ్ళాన్ని గారూ అంటున్నావంటే కసిమీద వున్నట్టున్నావ్. నేను మళ్ళీ వస్తాలే.

( ప్రసాదరావు ఎగ్సిట్ )

భాను : అమ్మతో మాట్లాడి వారం దాటిందమ్మా, ఎలా వుందో ఏమిటో నాకు బుద్ధి లేదమ్మా ఇద్దరం ఒకచోట వుండొచ్చు గదా.

సుబ్బు : అలా బాధ పడకు నాన్నా. ఇపుడేమయిందని, అమ్మ ఫోన్ ఛార్జింగయిపోయివుంటుంది. ఏమండీ మరిది నెంబరు కాని, వెంకటలక్ష్మి నెంబరుగాని ట్రయ్ చేయండి. నాన్నకి బి.పి రైజవుతోంది.

కృష్ణ : మావగారు అనవసరంగా టెన్షన్ పడి బీపీ, షుగర్లు పెంచుకుని అపోలో, కామినేని అంటే నా వల్ల కాదు. ( మొబైల్లో నెంబరు డయలు చేసి ) హల్లో సత్యమూర్తి , నేనయ్యా కష్టాల మూర్తిని, అదే కృష్ణమూర్తిని ఎక్కుడున్నావ్.

సత్య : నరకంలో

కృష్ణ : ఏమిటి ఈనెట్ వర్కులు అక్కడికి కూడా ఫాలో అవుతాయా, జోకులాపి మేటరు చెప్పు. ( అంతలో సత్యమూర్తి లోపలికి వచ్చి తలవంచుకుని నిలబడ్డాడు. అతడిని చూడగానే భానుమూర్తి కంగారుగా )

భాను : రావయ్యా సత్యమూర్తి అత్తగారెలా వుంది. ముందా సంగతి చెప్పు.

సత్య : ( నీళ్ళు నములుతూ ) అత్తగారా ...అత్తగారు....

కృష్ణ : హలో...హల్లో

సత్య : అన్నయ్యగారూ ( చేతులు చాపి బావురు మన్నాడు )

కృష్ణ : ( వెనిక్కి తిరిగి సత్యమూర్తిని చూసి  అంత ఉద్వేగంలో ) తమ్ముడూ.

సత్య : అన్నగారూ

కృష్ణ : తమ్ముడు గారూ

భాను : ఆపండయ్యా  ఇద్దరికి  ఇద్దరు తెగ నటించేస్తున్నారు. సత్య మూర్తి అలా కూర్చో, అదికాదయ్యా  అత్తగారెలా వున్నారయ్యా అని అడిగితే  సమాధానం  చెప్పకుండా ఆ ఓవరాక్షన్  ఏమిటి. ఇప్పుడు  చెప్పు  అత్తగారు  ఎలా వుంది.  నా పుట్టిన  రోజుకి రావాలి గదా  ఎప్పుడొస్తానంది ( అంతలో  భాను మూర్తి ఫోన్  రింగయింది, కృష్ణమూర్తి  మేనేజ్ చేసాడు )

భాను :  హల్లో ....హల్లో....

కృష్ణ : బయిటకు  వెళ్ళండి సిగ్నల్స్ అందుతాయి ( భానుమూర్తి హల్లో...హల్లో అనుకుంటూ  బయిటకు వెళ్ళిపోగా, సుబ్బలక్ష్మి  కాఫీ తెస్తానంటూ లోనికి వెళ్ళింది )

కృష్ణ : అయన రాకముందే  విషయం  చెప్పు అత్తగారి టాపిక్ రాగానే మొహంలో  కలర్సు మారుతున్నాయి.  ఏమిటి మేటరు, సిక్కయిందా.

సత్య : వూహు....

కృష్ణ : రాను పొమ్మందా....

సత్య : అసలు  అడిగితే  కదా...

కృష్ణ : ఎందుకని  అడగలేదు.....

సత్య : అసలుంటేకదా....

కృష్ణ : ఆ ...షాపు క్లోజా ?

సత్య : అమ్మో  అది కాదండి ఆవిడ  ఎక్కడుందో  నాకు తెలీదు, చెప్పా పెట్టకుండా తుర్రు, వారం అయింది.

కృష్ణ : కంగ్రాట్స్ బ్రదర్  మరి ఇంకా  కంగారు  టెన్షన్ దేనికి  లక్కీ ఫలోవి నా పొజిషన్ చూడు.  ఎగరటం మర్చిపోయిన ముసలి కాకి  లాగా ఎలా కుర్చున్నాడో.

సత్య : అదికాదు బ్రదర్  నాభయం. ఆవిడ ఏ నూతిలోనో గోతిలోనో  దూకితే  నా పొజిషన్ ఏమిటి.

కృష్ణ : కంగారు పడకయ్యా మర్డర్లు చేసి దేశాన్ని  దోచుకున్న  వాళ్ళ చేతులూపుతూ చిరునవ్వుతో కెమేరాలకి ఫోజులిస్తూ జైల్‌కి వెళ్ళే కాలంలో నీకింత వర్రీ అనవసరం.

సత్య : నే కష్టాల్లో వుంటే  మీ కామెడీ ఏమిటండీ మవయ్యాగారికి చెప్పేస్తే.

కృష్ణ : బాబ్బాబు అంతపని  చెయ్యకు. ఆయన అప్సెట్టయి అపోలోకి పోతే నే దివాళాతీయాలి.

సత్య : మీ ప్రాబ్లమ్స్ మీవి. నా టెన్షన్ నాది. చెబితే మీకిబ్బంది, చెప్పకపోతే  అందరూ నా మొహాన వుమ్మేస్తారు ( అంతలో ప్రసాదరావు ఎంట్రీ )

ప్రసా : సారీ మీరేదో సీరియస్సుగా మాట్లాడ్తున్నారల్లే ఉంది. ఏం లేదు ఇందాక  ఆ ఎమౌంటు.

కృష్ణ : మీకింత అనుమానం  పనికి రాదండి పారిపోతానా

ప్రసా : నే చెప్పేది  వినవయ్యా  నాకు తొందరలేదు వీలు చూసుకుని, మెల్లిగా ఇవ్వమని చెప్పటానికొచ్చా, వినిపించుకోకుండా ఒకటే తొందర ఆవేశం.

కృష్ణ : థాంక్సండి....  మా నైబరు  ప్రసాదరావు గారని ఏ ఫైన్ జెంటిల్మన్.

ప్రసా : అవును  పదివేలు ఫైన్.

కృష్ణ :  సత్యమూర్తిని  నా షెడ్డకుడు, చిన్న ప్రాబ్లమ్  వస్తేను.

ప్రసా : సరే మీరు  మాట్లాడుకొండి నేవెడతా. ఈ సంగతి  చెప్పిపోదామని – అవును చిన్న ఇన్ఫర్మేషన్  నాభార్య నీ భార్యకి నా గురించి....

కృష్ణ :  మీరు కాకుండా  అక్కడ ఇంకోడెవడున్నా  నీకు బుద్దుందా  మనిషివా పశువ్వా...

ప్రసా : ఓ.కే. ఓకే. ఫ్లో అర్ధమైంది వస్తా....

( బయిటనుంచి వస్తున్న  భాను మూర్తికి డాష్ కొట్టాడు )

భాను : కళ్ళు కనిపించడంలా  డాక్టరురు  దగ్గరకి  తీసుకెడతా పద.  అశ్రద్ద చెయ్యకు.

ప్రసా : ఓ.కే. ఓకే ఫ్లో అర్ధమైంది ( ఎగ్సిట్ )

భాను : ఎవరో నయ్యా  ఫోన్ చేస్తున్నారు కట్ చేస్తున్నారు.

( సుబ్బలక్ష్మి కాఫీ తెచ్చి  సత్యమూర్తికిచ్చింది )

సుబ్బు : అవునూ అమ్మేలా వుంది ఎప్పుడొస్తానంది.

సత్య : అమ్మగారా. అదే యూమీన్ అత్తగారా...హి...హి...హి....

కృష్ణ :  ఎన్నిసార్లు  ఎంత మంది అడుగుతారు... పూర్ ఫెలో ఆవిడ హాయిగా  ఆరోగ్యంగా వెన్నెల్లో తాజ్‌మహల్  లాగా వెలిగి పోతోందిట. కాస్త వొళ్ళుచేసి  కలరొచ్చిందంట. కదా తమ్ముడూ...

సత్య : అన్నగారు  చాలు.  చాలు ఆపండి

భాను :  ఏమిటయ్యా ఆపేది... ఇదేమన్నా డ్రామానా ...దానికేం అదృష్టవంతురాలు. ఇంతకీ ఎప్పుడొస్తానన్నది.

కృష్ణ : రేపు రాత్రికి బయల్దేరి ఎల్లుండి వుదయానికల్లా వస్తావని మీకు మరీ మరీ చెప్పమన్నారట కదా తమ్ముడూ.

సత్య : అన్నగారు చాలు. చాలు ఆపండి.

భాను : అమ్మాయి నాకేదో అనుమానంగా వుందే.

సత్య : నే చెప్పానా నా ప్రాబ్లమ్స్ మీకు తెలీకుండా ఇష్టానికి మాట్లాడేస్తారు. ఇప్పుడు చూడండి ఏంటి నా పొజిషన్.

కృష్ణ : కంగారు పడకు ధైర్యంగా వుండు. మావగారు ఓ సగంతి చెప్పండి. అత్తగారు కూలాసాగా వున్నారు కాస్త కలరొచ్చారంట అన్నా దీంట్లో అనుమానం రావటానికి ఏవుందని.

భాను : నువ్వేం మాట్లాడతావో నాకర్థం కాదయ్యా నాకు కడుపులో గుడగుడలాడుతోంది టాయ్ లెట్టుకి వెళ్ళాలని నేనంటే.

సత్య, కృష్ణ : అంతేనా ( షేక్ హాండిచ్చుకున్నారు )

కృష్ణ : సుబ్బులూ మావగార్ని మరుగు దొడ్డికి తోడ్కొని పోమ్మా. మెల్లిగా తీసుకురమ్మ...

సుబ్బు : పద నాన్నా

భాను : అత్తగారితో పాటు వెంట లక్ష్మిని కూడా రమ్మను. అందరం కలిసి చిలుకూరు బాలాజీ దర్శనం చేసుకుందాం.

( సుబ్బలక్ష్మి భాను మూర్తి లోపలికి వెళ్ళిపోయారు )

కృష్ణ : చెప్పవయ్యా అత్తగారితో గల కష్ట నష్టములు పది పంక్తులు మించకుండా చెప్పు.

సత్య : మావగారు మీ దగ్గర అత్తగారు నా దగ్గర వుంటారంటే పోన్లే పెద్దవారు అండగా వుంటానెనుకున్నా. ఓయమ్మో ఈ ఓల్డు పీపుల్ని మేనేజ్ చేయడం చాలా కష్టం.

కృష్ణ : అవును దానికన్నా వుదృతంగా వున్న ఉద్యమాన్ని ఉక్కుపాదంతో నొక్కి పారెయ్యటం వెరీ ఈజీ. అసలు ప్రాబ్లమ్ ఏమిటి.

సత్య : దేవుడు పిచ్చి భక్తి ముదిరి వెర్రితలలు వేసింది. ప్రతిరాయికి మొక్కటం పూజలు వ్రతాలు గుళ్ళు గోపురాలు అని తిరగటం.

కృష్ణ : తిరగనీయవయ్యా ఆవిడకి ఓపికుంది తిరుగుతుంది. నీకేం ప్రాబ్లం అని.

సత్య : నాకేం ప్రాబ్లమా నా జేబులో పర్సు తీసుకెళ్ళి దేవుడు హుండీలో వేస్తే ఎవరికది ప్రాబ్లమ్.

కృష్ణ : మైగాడ్

సత్య : ఇంకా వినండి మొన్నకి మొన్న ఓ గంజాయదమ్ము వెధవని స్వాములవారంటూ తీసుకొచ్చి పాద పూజలు, పంక్తి భోజనాలు. వాడు పోతూ పోతూ నా భార్య చెవికమ్మలు, చేతిగాజులు, ఫ్రిజ్ మీదుంటే పట్టుకుపోయాడు.

కృష్ణ : అపుడేం చేసావ్.

సత్య : యాభై వేలు అప్పు తీసుకొని చేయించేదాకా దగ్గరకు రానిస్తే ఒట్టు.

కృష్ణ : ఎవరు అత్తగారా.

సత్య : ఛీ ఛీ నా భార్య వెంకటలక్ష్మి ఇంతేనా అని అడక్కండి ఇంకా వున్నాయ్

కృష్ణ : వద్దు వద్దు సమస్య తీవ్రత అర్ధమైంది. మనకి భార్యలతో ప్రాబ్లమ్ లేదు. ఈ పెద్దవాళ్ళే వాయించి పారేస్తున్నారు. పోనీ ప్రవర్తనలు మార్చుకోకపోతే కాషాయం కట్టి సన్యాసుల్లో కల్సిపోతాం అని బెదిరిస్తే.

సత్య : అదీ అయింది. అలా అన్నాననే పెద్ద రాద్దాంతం చేసి చెప్పా పెట్టకుండా లేచక్కా పోయింది. ఏం చేయాలో తెలీక ఇలా వచ్చా.

కృష్ణ : ఈ విషయం తెలిస్తే ముసలాడు అప్సెట్టయి అపోలో దారిపట్టడం ఖాయం.

సత్య : పైగా రేపు బయలు దేరి వస్తోందని అబద్దం గూడా చెప్పారు.

కృష్ణ : ఒక మంచి మాస్టరు ప్లాన్ వేసి తెలివిగా మానేజ్ చెయ్యాలి.

సత్య : త్వరగా చెప్పండి.

కృష్ణ : మనం అంతా కల్సి నాటకం ఆడాలి. ఆ దెబ్బతో మనిద్దరి ప్రాబ్లమ్స్ పరిష్కారం అవుతాయి. మొన్న తల దిమ్ముగా వుంటోంది, లోపలి నుంచి ఏవో శబ్దాలు వినిపిస్తున్నాయంటూ డాక్టరు దగ్గరకి వెళ్ళి వచ్చాడు.

సత్య : అచ్చా డాక్టర్ ఏమన్నాట్ట.

కృష్ణ : మీ మైండ్‌లో చిన్న ప్రాబ్లమ్ వుంది మెడిసిన్స్ వాడి చూద్దాం, తగ్గక పోతే చిన్న సర్జరీ అవసరం కావచ్చు అన్నాట్ట.

సత్య : ఓ.కే.అయితే

కృష్ణ : ఇప్పుడు మనం ఆ సమస్యని వాడుకుని  చిన్న డ్రామా ఆడదాం, నాకు తెల్సిన డ్రామా ఆర్టిస్టుంది ఆవిడని రేపుదయం అత్తగారి పాత్రలో ప్రవేశ పెడతాం. నువ్వు, నేను, సుబ్బులు అందరం కూడా బలుక్కుని ఆవిడే అత్తగారు అనేలా ప్రవర్తిస్తాం.

సత్య : కాని ముసలాయన ఈ విడ నాభార్య కాదు మొర్రో అని గోల పెడతాడుగా.

కృష్ణ : డాక్టరు చెప్పిన ప్రాబ్లం ముదిరి భార్యని  గుర్తు పట్టలేకపోతున్నాడని నమ్మించేలా నటిస్తాం, వాదిస్తాం.

సత్య : మరి పరారీలో ఉన్న అసలు అత్తగారి మాటేమిటి.

కృష్ణ : పేపర్లరో, టీవీల్లో, ప్రకటనలిస్తాం.  అయినా నా గట్టి నమ్మకం ఏమిటంటే అత్తగారు తప్పుని సరిగా  వచ్చి  తీరతారు. నువ్వు ధైర్యంగా వుండు సుబ్బులకి మొత్తం ప్లాన్ చెప్పి నాటకానికి తెరతీద్దాం.

**లైట్సాఫ్**

**లైట్సాన్**

కృష్ణమూర్తి. సత్యమూర్తి టెన్షన్‌గా అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. వాచీలో టైం చూసుకుంటున్నారు.

సత్య : ఆడ్రామా ఆర్టిస్టుని  ఎన్ని గంటలకి రమ్మన్నారు.

కృష్ణ : వూరి నుంచి రావాల్సిన పాత్ర కాబట్టి వుదయాన్నే  ఎనిమిది గంటలకల్లా రమ్మన్నా అలాగే అంది. ఈ నాటకాలవాళ్ళకి  పంక్చుయాలిటీ తక్కువ ఇంతకీ మన కధానాయకుడెక్కడ. సుబ్బులూ, సుబ్బలక్ష్మి, ( సుబ్బలక్ష్మి ప్రవేశం )

సుబ్బు : ఏమిటండి.

సత్య : మావగారెక్కడ జలకాలాడుతున్నారా

సుబ్బు : కాదయ్యా...అమ్మ ఉదయాన్నే వస్తోందని చెప్పాంకదా, స్నానం చేసి బస్టాండుకెళ్ళారు.

కృష్ణ : ఆయన రాకమునుపే  మన అత్తగారి పాత్ర వస్తే కాసేపు రిహార్సల్స్ చేసుకోవచ్చు. ( అంతలో కృష్ణమూర్తి మొబైల్‌కి ఎస్.ఎమ్.ఎస్. వచ్చిన సౌండు )

సత్య : ఏదో మెసేజ్ వచ్చినట్టుంది అత్తగారి  దూపేమో.

కృష్ణ : కాదయ్యా – నా భార్య – నీ భార్యకి నాగురించి ... ( అంతకు చదివి వీధి గుమ్మంవైపు చూడగా ప్రసాదరావు అక్కడ తల వంచుకుని నిలబడున్నాడు )

కృష్ణ : ప్రసాదరావుగారూ దిసీజ్ టూమచ్ మీకింత అనుమానం పనికి రాదు. నిన్న స్పష్టంగా సరళమైన భాషలో నీ భార్య నా భార్యకి నీ గురించి చెప్పినట్టుగా నా భార్య నాకు ఏం చెప్పలేదు మహా ప్రభో అని – మళ్ళీ ఈ మెసేజ్‌లేమిటి – కాస్త బుద్ధి జ్ఞానం ....

ప్రసా : ఓకే.ఒకే ఫ్లో అర్ధమైంది. కాని నే వచ్చింది అందుక్కాదు, మా కామాక్షి ఇక్కడికి గాని వచ్చిందా అని అడిగి తెలుసుకోవటానికి.

కృష్ణ : అంటే మిస్సంగా.

సుబ్బు : మార్కెటుకి గాని వెళ్ళిందేమో

ప్రసా : చెప్పకుండా వెళ్ళదమ్మా రాత్రి బ్యాగ్ సర్దుకుంటుంటే అనుమానం వచ్చి క్యాజువల్‌గా అడిగినట్టు అడిగితే, వాషింగ్‌కి వెయ్యాల్సిన బట్టలంది. ఇప్పుడేమిటి చెయ్యటం కృష్ణమూర్తి నాకు కంగారుగా ఉంది. ఏం చెయ్యమంటావ్.

కృష్ణ : భార్యలు చెప్పకుండా పోతే భర్తలు ఏం చెయ్యాలి ఏం చేస్తారు అని విషయం నాక్కూడా కొత్తే.

సుబ్బు : తప్పిపోయిన వారి గురించైతే వెతకవచ్చు, బ్యాగ్ సర్ధుకుపోయిన ఆడదాని గురించి వెతకటం వేస్టు.

సత్య : బాగా చెప్పారు వదినగారు. అలా కూర్చుని చేసిన పొరపాట్లకి చింతిస్తూ ఎదురు చూడండి.

( ప్రసాదరావు ఏం చెయ్యాలో పాలు పోనివాడిలా దిగాలుగా అక్కడ కూలబడ్డాడు. అదే సమయానికి కామాక్షి చిన్న బ్యాగ్ భుజాన వేసుకుని అక్కడికి వచ్చి ప్రసాదరావుని చూసి చటుక్కున పమిట కొంగుని మొగం కనిపించకుండా కప్పుకుంది.... మొహం కనిపించకపోవటంతో ఆమెని డ్రామా ఆర్టిస్టుగా పొరపాటు పడ్డారు )

కృష్ణ : హమ్మయ్యా వచ్చారా మీ గురించే వెయిటింగ్ మావగారూ అంటే మీ మొగుడి పాత్ర బస్టాండుకెళ్ళింది. ఏ క్షణానికైనా రావచ్చు. ఇతను సత్యమూర్తి నా షెడ్డకుడు.

అంటే నీ చిన్నల్లుడు. ఇది నాభార్య పేరు సుబ్బలక్ష్మి అంటే నీకు పెద్ద కూతురు. ఇవీ ముఖ్యమైన పాత్రలు. ఈ పాత్ర పక్కింటి పాత్ర. వైఫ్ మిస్సింగ్ మనకు సంబంధంలేదు. ప్రసాదరావు గారూ మాకిక్కడ ముఖ్యమైన కార్యక్రమం వుంది దయచేసి మీరు మీ పోర్షన్లోకి వెళ్ళి చింతిస్తారా.

( ప్రసాదరావు ముసుగులో వున్న భార్య వంక అనుమానంగా చూస్తూ )

ప్రసా : ఎవరది కృష్ణమూర్తి ఎవరీవిడ.

సుబ్బ : మా అమ్మ నన్ను అమ్మాయ్ సుబ్బులూ అని పిలుస్తుంది. గుర్తుంచుకోండి. ఏదీ ఒకసారి పిలవండి.

కామా : అమ్మాయ్ సుబ్బులూ.

ప్రసా : వాయిస్ గూడా మ్యాచ్ అయింది. ఎవరండి ఎవరీవిడ హల్లో మిమ్మల్నే

కృష్ణ : ఇది మాపర్సనల్ డ్రామా, అయ్ మీన్ మా రియల్ పర్సనల్ ప్రోగ్రామ్. మీరు మీ పోర్షన్లోకి నిష్క్రమించండి. ఛీ ఛీ అన్ని డ్రామా డైలాగులు . మీరు మీ ఇంటికి పోండి.

( ప్రసాదరావు ఈ మాటల్ని పట్టించుకోకుండా కామాక్షి మొహం చూసే ప్రయత్నంలో వున్నాడు. కాని కామాక్షి అవకాశం ఇవ్వక వేరే వైపు తిరుగుతోంది. ప్రసాదరావు కామాక్షి గుండ్రంగా తిరుగుతున్నారు. )

సత్య : హల్లో ఏవండోయ్ మీ పేరేమిటో గానీ ఆవిడే మా అత్తగారు. పెద్దావిడ చుట్టూ తిరగడం పద్దతి కాదు. సభ్య సమాజం సిగ్గుతో తల వంచుకుంటుంది.

కామా : అమ్మాయ్ సూబ్బులూ

సుబ్బు : ఏమిటమ్మా

కామా : ఎవడే వీడు నా చుట్టూ తిరుగుతున్నాడు సున్నం బట్టీవాడిలా

సుబ్బు : కాదమ్మా ప్రసాదరావు గారని పక్కింటాయిన

కృష్ణ : ఆయన గారి భార్య చెప్పా పెట్టకుండా జెండా పీకేసింది.

కామా : అయితే మాత్రం వెళ్ళి బయిట వెతుక్కోవాలిగానీ, ఈ ప్రదక్షిణాలేమిటి అసహ్యంగా.

సత్య : చూసారా అత్తగారు బాధ పడుతున్నారు, మామగారు గాని వచ్చి చూసారా పర్యవసానం ధారుణంగా వుంటుంది.

సుబ్బు : మీకే చెపుతున్నది ఏవండోయ్.

ప్రసా : అదే హైట్, బ్యాక్ సియ్ టు సేమ్ వాయిస్ డిటో. లేదమ్మా మీ అమ్మగారు నా వైపేమో అని డౌటుగా వుంది.

సుబ్బు : ఆ....

ప్రసా : అదేనమ్మా ఈ ముసుగులో వున్నది మా కామాక్షి అని నా అనుమానం

కృష్ణ : మీకా అనుమానం అక్కర్లేదండి. వాస్తవం చెపుతున్నా. ఆవిడా ఒక డ్రామా ఆర్టిస్టు మా అత్త గారు అవుటాఫ్ కవరేజి ఏరియా అవటం చేత తాత్కాలికంగా ఈవిడ సేవలు వినియోగించుకుంటున్నాం. ఇది వాస్తవం, సత్యం దయచేసి నమ్మండి ప్లీజ్.

( ప్రసాదరావు అనుమానం నివృత్తి కాక వెనక చూపులు చూసుకుంటూ వీధి గుమ్మంవైపు వెడుతుండగా, బయిట నుంచి భాను మూర్తి ప్రవేశం )

భాను : అమ్మాయ్ అమ్మ ఫోనేమో స్విచ్ఛాఫ్ అని వస్తోంది... ఈవిడెరు.

కృష్ణ : ఈవిడెవరా... గోవిందా గోవిందా...అనుకున్నంత అయింది అడ్డమైన మందులు మింగొద్దండీ అని మొత్తుకున్నాం విన్నారా.

సత్య : అయినా రోగం వస్తే డాక్టరు దగ్గరకి వెడతాం మెడిసిన్స్ వ్రాసిస్తే వాడతాం. రోగం కుదురుతుంది. అంతే గాని ఏం లేకపోయినా వూహించుకొని మందులు మింగితే ఇలాగే అవుతుంది.

భాను : మీరిద్దరూ ఏం మాట్లాడుతున్నారో నాకర్ధం కావటంలా, ఈవిడెవరయ్యా అంటే రోగాలు, మందులు వాటి స్వభావాలు గురించి మాట్లాడతారేమిటి.

( ఈలోపు ప్రసాదరావు అనుమానం నివృత్తికి మరోమారు రివ్వున పరుగున వచ్చి కామాక్షి మోహం చూసే ప్రయత్నం చేయగా ఆమె మొహం దాచుకుంది )

కృష్ణ : మిష్టర్ ప్రసాదరావు దిస్ ఈజ్ టూమచ్ you are trying to outrage the modesty of a respectable women get lost.

ప్రసా : ఫ్లో అర్ధమైంది కాని మా కామాక్షేమోనని

సత్య : కామాక్షి కాదు, మీనాక్షి కాదు మా అత్తగారు అండర్‌స్టాండ్.

భాను : ఏమిటయ్యా అన్నావ్ ఈవిడ మీ అత్తగారా అంటే మీ మేనత్తగారా.

కృష్ణ : చూసావా బ్రదర్ అత్తగారికి, మేనత్తగారికి తేడా తెలీకుండా పోయిందంటే ది వరస్టు స్టేజ్ హాపెన్డు మా కొలీగ్ ఫాదర్కి ఇదే ప్రాబ్లమ్

కామా : అమ్మాయ్ సుబ్బులూ

సుబ్బు : ఏం అమ్మా

కామా : ఏంటమ్మా ఇది అనుమానించే భర్త ఎదుట ముసుగేసుకొని నిల్చోటం కన్నా నమర్థా ఏవుందమ్మా.

కృష్ణ : ( కంగారుగా ) అత్తయ్య గారు ఎక్కువగా మాట్లాడకండీ పోర్షన్ తెలీకుండా పిచ్చి పిచ్చి పిచ్చిగా వాగితే.

సత్య : కథ అడ్డం తిరుగుతుంది, వదిన గారు అత్తగార్ని లోపలికి తీసుకెళ్ళండి. ప్రయాణం చేసి అలసిపోయారు.

( కామాక్షిని తీసుకొని సుబ్బలక్ష్మి లోనికి వెళ్ళబోగా భాను మూర్తి అడ్డుకుంటాడు )

భాను : ఏమిటయ్యా ఈవిడ నాభార్య. మీ అత్తగారా మీ కళ్ళకి నేనెలా కనిపిస్తున్నా సుబ్బులు మాట్లాడవేం ఏమిటి డ్రామా.

కృష్ణ : డ్రామా కాదు సినిమా కాదు పచ్చి నిజం మీకు మందు వికటించి మెదడు పాడయ్యి భార్యని గుర్తించే పవర్ పోయింది. అదీ మేటరు.

సత్య : మా కొలిగ్ ఫాదర్‌కి గూడా ఇదే ప్రాబ్లమ్ అన్నారు.

కృష్ణ : ఈ కేసు కొంతలో కొంత నయం భార్యని గుర్తించలేకపోతున్నారు. ఆ కేసు మరీ ధారుణం. అద్దంలో చూసుకుని ఎవరు నువ్వని కేకలు అరుపులు.

( ప్రసాదరావు రావటానకి మరో ప్రయత్నం చేయగా సత్యమూర్తి పట్టుకున్నాడు )

సత్య : వదినగారూ అత్తయ్యగారిని లోపలికి తీసుకెళ్ళండి, కాలకృత్యాలు తీర్చుకున్నాక తీరుబడిగా మాట్లాడుకుందాం. ( సుబ్బలక్ష్మి కామాక్షిని తీసుకొని లోనికి వెళ్ళింది. ఇంతలో కృష్ణమూర్తి సెల్ రింగయింది )

కృష్ణ : హలో ఎవరు అ...అలాగా మరి మరి ఓమైగాడ్

సత్య : ఏమిటండీ ఎవరు, మేటరు సీరియస్సా

కృష్ణ : ఇలారా ....( పక్కకి తీసుకెళ్ళి ) మనం రమ్మన్న డ్రామా ఆర్టిస్టుకి టీవీ షూటింగ్ పడిందట రాలేనని ఫోన్

సత్య : వ్వాట్, మరి ఈ ముసుగు రాణీ ఎవరు....

భాను : ఏమిటయ్యా ఏమైంది దేనికా కంగారు

కృష్ణ : అంతా అయోమయంగా వుంది. నే లోపలికి వెళ్ళి అన్ని విషయాలూ మాట్లాడి వస్తా గానీ ఈ ముసలాయని లోపలికి రాకుండా మాటల్లో పెట్టు ( కృష్ణమూర్తి లోనికి ఎక్సిట్ )

సత్య : మావగారు ఇలా కూర్చోండి రిలాక్సవండి అసలే మీ హెల్తు మంచిదికాదు.

భాను : సత్యమూర్తీ నా మొహం చూసి నిజం చెప్పు ఆ వచ్చింది నిజంగా నా భార్యేనా, మీ అత్తగారేనా

సత్య : అత్తగాగారేనా అంటే ఒరిజినల్ ప్లాన్ ప్రకారం అయితే అత్తగారే అవ్వాలి. కాని చిన్న తేడా వచ్చింది. లోపల చర్చలు జరుగుతున్నాయి. అక్కడి నిర్ణయాలను బట్టి సమాధానముంటుంది.

భాను : ఒరిజినల్ ప్లాన్ ఏమిటి, చర్చలేమిటి నాకు ఒక్క ముక్క అర్థం కావటంలా

సత్య : మీకేంటీ మాదీ అదే పరిస్థితి ( సుబ్బలక్ష్మి, కృష్ణమూర్తులు బయిటికి వచ్చారు సత్యమూర్తి వారి దగ్గరకు వెళ్ళి ఆత్రంగా )

సత్య : ఏమిటీ విషయం మావగారు ఆ ముసుగు పిన్నిగారు ఎవరని అడుగుతున్నారు. ( సత్యమూర్తిని పక్కకి తీసుకెళ్ళి రహస్యంగా )

కృష్ణ : ఆ వచ్చింది పక్కింటి ప్రసాదరావు భార్య కామాక్షి గారు.

సత్య : ఆ అంటే మరిప్పుడు షో కాన్సిలా.

కృష్ణ : అనే అనుకున్నా కానీ కామాక్షి గారు వొప్పుకోవడంలేదు. ప్రసాదరావు తప్పు తెలుసుకుని క్షమించమనే దాకా నేనే మీ అత్తగారిని అంటోంది.

సత్య : ఇదెక్కడి ఫిట్టింగండీ బాబూ, మరేంటి దారి

కృష్ణ : తప్పదు షో కంటిన్యూ అవ్వాల్సిందే let the show go on

భాను : అమ్మాయ్ ఏవిటే ఆ గుసగుసలు. అవునూ ఆ ముసుగు కప్పుకుని వచ్చిన ఆవిడేదీ ఎవరావిడ, ఇక్కడికెందుకొచ్చింది. మీరేదో నా దగ్గర దాచి నాటకం ఆడుతున్నారు నిజం చెప్పండి.

కృష్ణ : మావగారూ అనవసరంగా ఆవేశ పడి బిపి పెంచుకోకండి మా మాట నమ్మండి. ఆ వచ్చింది మా అత్తగారు మీ భార్య.

సత్య : మీకు బ్రెయిన్లో చిన్న ప్రాబ్లమ్ వచ్చి ఆవిడని గుర్తుపట్టలేక పోతున్నారు.

భాను : అమ్మాయ్ వాళ్ళంటే అల్లుళ్ళు నువ్వు నాకన్న బిడ్డవి నువ్వు నిజం చెప్పు నిజంగా నాకు బ్రయిన్ పాడయిందా ఆ వచ్చింది మీ కన్న తల్లేనా చెప్పమ్మా.

( సుబ్బలక్ష్మి ఏం చెప్పాలో తెలీక ఆయన భుజం పై వాలి పోయి ఏడుపు నటిస్తోంది )

సుబ్బు : నాన్నా ఏం చెప్పను నాన్నా ఎలా చెప్పను నాన్నా ఏవండీ ఏమిటి నాకీ పరీక్ష.

కృష్ణ : భాదపడకు సుబ్బులు నీ పొజిషన్ నాకర్ధమైంది. కాని పితృ ప్రేమకన్నా పతి భక్తి గొప్పది. కాసేపు మనసు గట్టి చేసుకో.

భాను : ఏమిటయ్యా ఇందాకటినుంచి చూస్తున్నా పిల్లదాన్ని యుద్దానికి పంపిస్తున్నట్టు ప్రిపేర్ చేస్తున్నావు. సరే ఎవరూ చెప్పనక్కర్లా, ఆ ముసుగు రాణిని వచ్చి ముసుగు తీసి నిలుబడమను, నా భార్య అవునో కాదో పరెఫెక్ట్‌గా చెపుతా.

సుబ్బు : అమ్మా డాడీ పిలుస్తున్నారు.... ఇలా రా

కామా : లోపలినుంచి ఇరుగు పొరుగు వారిని పోగేస్తే నే రానమ్మా నాకు తలకొట్టేసినట్టుంది.

సత్య : ఇరుగు పొరుగు వాళ్ళా ( అనుమానంగా చూడగా ప్రసాదరావు మొహం కనిపించకుండా మంకీ క్యాప్ పెట్టుకుని నక్కి నక్కి చూస్తుండటం కనిపించి )

కృష్ణ : ఏమిటి మీరింకా ఇక్కడే వున్నారా ఇది మా ఫ్యామిలీ ఎఫైర్ నో ఎంట్రీ ఫర్ అవుట్ సైడర్స్ గెటవుట.

ప్రసా : ఫ్లో నాకర్ధమైంది కాని ఆవిడ మీ అత్తగారు కాదేమోనని నాడౌటు.

భాను : నాదీ అదే డౌటు రా. ఇదిగో ప్రసాదరావు దా ఇలా వచ్చి నా పక్కన కూర్చో ధైర్యంగా వుంటుంది.

కృష్ణ : ఆయనిక్కడ వుంటే అత్తగారు బయిటికి రాదు. దట్సాల్.

భాను : అదేమిటయ్యా నా భార్యకి వీడికి ఏమిటి సంబంధం.

సత్య : వుంటాయండి బాబూ కంటికి కనిపించని మనకి అర్ధంకాని రిలేషన్స్ తగలడతాయి.

కృష్ణ : అత్తగారి గురించి నిజ నిర్దారణ జరగాలంటే ఇక్కడి నుంచి ఈ పాత్ర నిష్క్రమించాలి.

భాను : తప్పదా.

కృష్ణ : తప్పదు తప్పదు

సుబ్బు : పతి భక్తి జిందాబాద్ తప్పదు.

భాను : ప్రసాదరావు ఆవిడ నీ భార్యని నువ్వంటుంటే కాదంటున్నారు. నా భార్య కాదు మొగ్రో అంటే అవునంటున్నారు. అంతా మళయాళం సినిమా మధ్యనుంచి చూసినట్టుంది. సరే నువెళ్ళు అవసరమైతే పిలుస్తా.

ప్రసా : మీ సమస్య నా సమస్య పెనవేసుకొని పోయినట్టుగా నా అనుమానం. సరే అలాగే కానీయండి. ( వెనక చూపులు చూసుకుంటూ ప్రసాదరావు ఎక్సిట్ )

కృష్ణ : అత్తగారు పరాయి వారిని తరిమి కొట్టాం మీరు హాపీగా రావచ్చు

సత్య : వదిన గారు మీరెళ్ళి అత్తగారిని ప్రిపేర్ చేసి తీసుకురండి.

సుబ్బు : పతి భక్తి జిందాబాద్ అలాగే మరిది గారు

( సుబ్బలక్ష్మి లోనికి వెళ్ళింది అంతలో భానుమూర్తి మొబైల్ రింగైంది )

భాను : హల్లో ఏవైపోయావ్ అలాగా కులాసాగా వున్నావు గదా ఓకే. రాత్రికి మళ్ళీ ఫోను చెయ్యి

కృష్ణ : రాత్రికి ఫోన్ చెయవంటున్నారు ఎవరికేంటీ.

సత్య : పాత పరిచయస్తులయి వుంటారు.

భాను : భలే కనిపెట్టావయ్యా నా అల్లుళ్ళు యమా బ్రయిట్ ( అంతలో లోపలినుంచి సుబ్బలక్ష్మి కామాక్షిలు అక్కడికి వచ్చారు. కామాక్షి నాటకీయంగా రెండు చేతులు చాచి.

సుబ్బు : ఏవండీ ఎలా వున్నారండి అదేమిటండీ అంతగా చిక్కిపోయారు, అమ్మాయ్ నాన్నాగారిని సరిగ్గా చూసుకోవడంలేదా

( అంతే భాను మూర్తి గూడా అదే ఫక్కీలో చేతులు చాచి )

కృష్ణ : ఇప్పుడేమంటారు.

భాను : ఈ ఫేసుని ఎక్కడో చూసానయ్యా, ఎక్కడబ్బా

సత్య : చూసినట్టు లీలగా గుర్తుందా

కృష్ణ : వుండవయ్యా లీలగా లేదు సుశీలగా లేదు ముప్పై సంవత్సరాలు కాపురం చేసిన ఇల్లాలి ఫేసు ఈ పెద్ద మనిషికి లీలగా గుర్తుందట.

భాను : ఈవిడెవరో కాని నా భార్య మాత్రం కాదు.

సుబ్బు : అలా అనకు నాన్నా అమ్మ బాధ పడుతుంది, నీ పుట్టిన రోజు నాడు అమ్మని ఏడిపిస్తావా.

భాను : ఇదెక్కడి గొడవే నాకంతా అయోమయంగా వుంది.

కృష్ణ : వుంటుంది మావగారూ అర్ధం చేసుకోండి There is a problem with your brain.

భాను : I see there is Problem with My brain ok. మరి మీరందర్ని చక్కగా గుర్తుపడుతున్నా కదా, భార్యని మాత్రమే ఎందుకు గుర్తించడం లేదు.

సుబ్బు : త్వరగా చెప్పండి.

సత్య : వు చెప్పండి.

కృష్ణ : చెప్పండి చెప్పండి అంటే ఆలోచించుకు చావాలా, మావగారి ప్రశ్నకి జవాబు చెప్పాలంటే మెదడు మరియు నాడీ మండలము వాటి పని తీరు గురించి చెప్పాలి.

భాను : చెప్పవయ్యా వింటాం

కృష్ణ : నాడీ మండలములో వందల వేల నరాలుంటాయి వాటిల్లో భార్య నరం వేరు సంతానం వేరు అలాగే ఫ్రెండ్స్, లవర్స్, శత్రువులు ఇలా ప్రతి రిలేషన్స్‌కి ఒక నరం వుంటుంది.

సత్య : నాకర్ధమైంది...నాకర్ధమైంది ...మావగారి బ్రయిన్‌లో భార్యనరం నలిగిపోయింది అంచేత భార్యని గుర్తు పట్టలేక పోతున్నారు అవునా.

కామా : అంటే ఆ నరం మళ్ళీ బాగుపడదా ఆయన నన్ను గుర్తు పట్టలేరా.

కృష్ణ : కంగారు పడకండి మీ పూజలే మిమ్మల్ని కాపాడాలి.

భాను : సరేనయ్యా మీరందరూ అంటున్నట్టు ఈమె నా భార్య దమయంతే అనుకుందాం. అయితే నలభై సంవత్సరాలు నాతో కాపురం చేసింది కాబట్టి నా ప్రశ్నలకి ఠకీ ఠకీ మంటూ సమాధానం చెప్పమను. నా బ్రయిన్లో ఏదో ప్రాబ్లం వుందని అపోలోకి పోతా.

కృష్ణ : అమ్మో మావగారూ ఆమాట అనకండి నాకు గుండె పోటు వస్తుంది. మీ సందేహం ఏమిటో అడగండి.

భాను : ప్రశ్న జాగ్రత్తగా విను నాకు కుడి పిర్రపైన ఏముంది.

సత్య : పిర్రలపైన ఏముంటాయి రసిగడ్డో, చెమట పొక్కో వుంటుంది.

భాను : కాదు, చెప్పండి భార్య కాని భార్యామణి గారూ, పోనీ ఏముందో చెపుతా అవుననో కాదనో చెప్పమను, నాకు పిర్రమీద పావలా బిళ్ళంత పుట్టు మచ్చ వుందా లేదా చెప్పు ( ఆ ప్రశ్నకి ఇందరూ గుమిగూడి చర్చించుకుంటున్నారు.

సత్య : వుండే వుంటుంది వుందనండి.

కృష్ణ : అవును వుందిట మావయ్యగారు, అత్తగారు చెవిలో చెప్పారు.

భాను : అదేం కుదరదు నా ముందు నాకు చెప్పాలి.

కామా : సిగ్గుపడుతూ వుంది.

భాను : దమయంతీ ఎన్నాళ్ళయ్యింది నిన్ను చూసి, ( అక్కడున్న అందరూ షాక్ ) కామాక్షి కంగారు పడి కృష్ణమూర్తి వెనకాల నక్కి

కామా : ఇదేంటండీ

కృష్ణ : మావగారు కాస్త ఆగండీ ఆవిడ ఆవిడ

భాను : ఆవిడ లేదు ఈవిడ లేదు నాభార్య దమయంతి, అల్లుళ్ళూ మీ ఇద్దరికీ థాంక్సయ్యా నా కళ్ళు తెరిపించి నా వ్యాధి నయం చేసారు. రా దమయంతీ బెడ్ రూములో కూర్చుని మనసు విప్పి మాట్లాడుకుందాం

( ప్రసాదరావు పరుగు పరుగున అక్కడికి వచ్చి )

ప్రసా : ఇది మరీ బాగుంది ఈవిడ నా భార్య కామాక్షి మాట్లాడరేవండీ...

కృష్ణ : బ్రేకులు పోయిన కార్లో కూర్చునట్టుగా ఉంది ఏం మాట్లాడను.

సత్య : నా పరిస్థితి అదే,అదే కారులో వెనక సీట్లో ఉన్నా.

భాను : ఎవరూ ఏం మాట్లాడకండీ ఏమిటీ ఈ పంచాయితీ, వాళ్ళు నా అల్లుళ్ళు అది నా కూతురు. చెప్పండమ్మా ఈవిడ మీ అత్తగారు. మీ అమ్మ నా భార్య దమయంతి అవునాకాదా. ( ఇద్దరు అల్లుళ్ళూ తలవంచుకుని తలలూపారు )

భాను : నువ్వు చెప్పమ్మా మీ అమ్మ అవునాకాదా

సుబ్బూ : పతి భక్తి జిందాబాద్, అవును

ప్రసా : నో నేనొప్పుకోను, ఆవిడ కామాక్షి నా భార్య

భాను : రా దమయంతి అలా వెళ్ళి నీ ఒళ్ళో నా తల పెట్టుకుని పడుకోవాలి.

ప్రసా : నా పెళ్ళాం ఒళ్ళో మీరు తలపెట్టుకుని మీరు రిలాక్సవటం ఏమిటండీ. మాట్లాడరేవండి ( కామాక్షిని ఇద్దరు చెరో చెయ్యి పట్టుకుని లాగుతూ )

భాను : నా భార్య దమయంతి

ప్రసా : నాభార్య కామాక్షి

భాను : అవును

ప్రసా : కాదు

కృష్ణ : అబ్బ ఆపండి సమస్యని మనం మనం సామరస్యంగా పరిష్కరించుకుందాం.

ప్రసా : సరే ఈవిడ మీ భార్య దమయంతి అని ఏమిటి రుజువు.

ప్రసా : నా భార్యే నా రుజువు. కామాక్షి నన్ను క్షమించు, అర్థంలేని అనుమానాలతో నిన్ను ఇబ్బంది పెట్టాను క్షమించు. చెప్పు నేను నువ్వు భార్యా భర్తలం కాదా

భాను : వొరేయ్ నీకు బుద్దుందా పరాయి ఇల్లాల్ని నీ భార్య అని చెప్పమని అని అడగటానికి సిగ్గులేదు. పద దమయంతి వీళ్ళతో మనకెందుకు అల్లుళ్ళూ వీడిని బయటికి పంపండి.

కామా : ఆగండి, ఆ కుర్రాడు అంతలా వాదిస్తుంటే మనం పెద్ద వాళ్ళం సర్ది చెప్పాలి కానీ వెళ్ళి పోవడం న్యాయం కాదు. బాబూ నేను నీ భార్యనంటున్నావు, అయితే మీ ఇంట్లో మన పెళ్ళి ఫోటో గాని వుందా

ప్రసా : వుంది క్షణంలో తెస్తా అప్పడి దాకా మీరు ఇక్కడే వుండాలి

( ప్రసాదరావు బయిటికి పరిగెట్టాడు )

సత్య : బ్రదర్ మనం వేసిన ముడి బాగానే బిగుసుకుంది, మావగారు కామాక్షి తన భార్య అని నమ్మాడు సెటిలయిపోయాడు. మన అసలు ప్రాబ్లమ్ అలానే వుంది. మన అసలత్తగారి మాటేమిటి.

కృష్ణ : తప్పిపోయిన వారి గురించి వెతకవచ్చు, కావాలని వెళ్ళిపోయిన వారి గురించి ఎక్కడని వెతుకుతాం, దేవుడి పైన భారం వేసి ఎదురు చూడడం తప్ప మనమేమి చేయలేము.

సత్య : మీ నాటకంలో నన్ను కూడా కలుపుకుని మీ పరీక్ష పరిష్కారం చేసుకున్నారు. నా ప్రాబ్లమ్ దగ్గరకి వచ్చే సరికి దేవుడే దిక్కంటున్నారు. మావగారు

భాను : ఏం అల్లుడూ

సత్య : ఆహా ఏమీలేదు అత్తగారు చాలా కాలం తరువాత వచ్చారుకదా సరదాగా మీ దంపతులిద్దరు ఏ అపోలోకో వెళ్ళి టెస్టులు చేయించుకుంటే నాకు ఆనందంగా వుంటుంది.

కృష్ణ : సత్య మూర్తి

భాను : ఎందుకయ్యా అంతగా అరవడం, మంచివాడు మాపైనే అభిమానం ప్రేమ వున్నవాడు కాబట్టి అలా అన్నాడు, నువ్వు అనగలిగావా, రా దమయంతీ అలా అపోలో దాకా వెళ్ళివద్దాం.

కృష్ణ : చేతులు చాచి అడ్డుకుంటూ మావగారూ మావగారు మళ్ళీ మొదటికి రాకండి, బుద్ది గడ్డి తిని నాటకం ఆడా, ఈవిడ అత్తగారు కాదు, పక్కింటి ప్రసాదరావు భార్య కామాక్షి.

సుబ్బు : అవునాన్నా చీటికీమాటికీ మీరు చెప్పా పెట్టకుండా ట్రీట్మెంట్లంటుంటే ఆ బిల్లులు కట్టలేక మీకు మా సమస్య అర్ధం కావాలని ఇలా చేసాం.

కామా : అవునండి మావారి అనుమానాలకి అవమానాలకి, కడుపు మండి మీ అందరితో సహకరించా నేను మీ బిడ్డలాంటి దానిని.

భాను : బిడ్డలు ! అబద్దాలు చెప్పే వారు నాటకాలాడి, మోసాలు చేసేవారు బిడ్డలెలా అవుతారమ్మా, పసిపిల్లలు మారాంచేస్తుంటే దొబూచులాడి నవ్విస్తారు, కానీ ఈ పిల్లలు దోబూచులాడి పెద్దవారిని ఏడిపిస్తున్నారు.

సత్య : మావగారు నన్ను మన్నించండి అత్తగారి ఆధ్యాత్మిక దెబ్బకి తట్టుకోలేక విసుక్కున్నానని, చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు, ఈవిషయం దాచినందుకు మీరు ఏ శిక్ష విధించినా నేను రెడీ.

భాను : నేను చీటికీ మాటికీ ఆసుపత్రికి పరిగెడతానని అంటున్నారు కాని ఎందుకు వెడుతున్నానో, ఎవరిగురించి వెడుతున్నానో ఒక్క క్షణం ఆలోచించారా.

కామా : నాకు తెలుసు మీ మావగారు పాలసీ తీసుకున్నారు 75 సంవత్సరాలు జీవిస్తే పాతిక లక్షలొస్తాయి. ఆ డబ్బులు మీకివ్వాలని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

సుబ్బు : ఈ విషయం నీకెలా తెలుసు ( ప్రసాదరావు రావడం చూసి )

కామా : అదిగో ఆ బాబు చెప్పాడు.

ప్రసా : అబ్బా ఏవండీ మీరందరికీ హాపీ న్యూస్ మీ అత్తగారు వచ్చారోచ్చ్.

కృష్ణ : నిజమా ఎక్కడ

సుబ్బు : అమ్మా అమ్మా

సత్య : అబ్బ నా ప్రాబ్లమ్ సాల్వ్ అయింది.

ప్రసా : ఆగండి ఆగండి మీరాడిన నాటకం గురించి మొత్తం చెబితే ఆవిడ బోల్డంత బాధపడి

భాను : ఏడ్చింది కూడానా.

ప్రసా : ఏకధారగా ఏడ్చి వెళ్ళి పోతుంటే నేనే ఆవిడని ఆపి మా ఇంట్లో కూర్చోబెట్టి ఇలా వచ్చా.

కృష్ణ : చాలా థాంక్స్ ప్రసాదరావు

సుబ్బు : పదండి అమ్మని తీసుకువద్దాం

ప్రసా : ఆగండి ఆగండి ఇంకా నా భార్య సంగతి తేలాలిగా, నా భార్యని నాకప్పగిస్తే మీ అమ్మగారిని మీకప్పగిస్తా.

కామా : క్షమించండి ప్రేమలు లేని చోట అనుమానాలు, అవమానాలు తప్పవు, నేను తొందరపడితే క్షమించండి.

ప్రసా: కామాక్షి అయాం సారీ

కృష్ణ : ఏమిటయ్యా ఈ క్లైమాక్సు తప్పుకో తమ్ముడూ పద అత్తగారిని తీసుకొద్దాం.

సత్య : మావగారు సంతోషంగా ఉండండి అయిదు నిమిషాల్లో అత్తగారు మీ ముందుంటారు పదండి.

ప్రసా : ఆగండి నా మాటలు వినండి హలో( కృష్ణ మూర్తి,సత్యమూర్తి, ప్రసాదరావు ఎక్సిట్ )

భాను : అయినవాళ్ళు కాని వాళ్ళు అంతా అబద్దాలు, మోసాలు, నాటకాలు, ఆడితే సమాజం ఏమైపోతుందమ్మా

సుబ్బు : అమ్మ వచ్చిందిగా సంతోషంగా వుండునాన్నా బరువైన డైలాగులెందుకూ.

భాను : అమ్మ వచ్చేసిందా ఎలా వచ్చిందమ్మా ( అంతలో కృష్ణమూర్తి, సత్యమూర్తులు ప్రసాదరావుని రెండు చేతులపైన మోసుకుంటూ అక్కడికి వచ్చారు )

సుబ్బు : అదేమిటి ఆయన్ని అలా మోసుకొస్తున్నారు, అమ్మేది.

సత్య : మీ అమ్మగారు రాలేదుగా

కృష్ణ : ఈ రాస్కెల్ అబద్ధం చెప్పాడు.

భాను : అమ్మ రాదమ్మా రాలేదు, అమ్మ తీర్ధయాత్రలకి వెళ్ళింది. ఇంకా వారానికి గాని రాదు, హరిద్వార్ నుంచి నాకు ఫోన్ చేసింది ( ఆ మాట వినగానే ఆ.... అంటూ

ఇద్దరూ ప్రసాదరావుని వదిలేసారు ప్రసాదరావు కింద పడ్డాడు )

ప్రసా : కామాక్షీ నడుం విరిగింది.

కామా : పతి భక్తి జిందాబాద్ ఏవండీ ( భర్త దగ్గరకి వెళ్ళబోగా ....... )

------ ప్రీజ్ ------